# సాక్షి హనుమకొండ

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024







## దీప్తి.. ఓరుగల్లు కీర్తి

పారాలింపిక్స్‌లో కల్లెడకు చెందిన జీవాంజి దీప్తి కాంస్య పతకం సాధించి ఓరుగల్లు కీర్తిని చాటిచెప్పింది.

- 8లో▸



## పలు రైళ్లు రద్దు..

కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$28^0$ /$23^0$

## వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### శ్రీఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాలు



**హన్మకొండ కల్చరల్ :** వేయిస్తంభాల దేవాలయంలో శ్రీఉత్తిష్ట గణపతినవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత కోరారు. బుధవారం దేవాలయంలో ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మతో కలిసి ఆమె ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. వెంకటయ్య మాట్లాడుతూ దేవాలయంలో ఈ నెల 7నుంచి 16వతేదీ వరకు శ్రీ ఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అభిషేకపూజ, అలంకారసేవలో పాల్గొనాలనుకునే వారు రూ.2,116లు చెల్లించి రశీదు తీసుకోవాలని, వారికి.. స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, వెండి లాకెట్ అందించనున్నట్లు తెలిపారు.

### రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుధీర్



**హన్మకొండ కల్చరల్:** హనుమకొండ విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ నడ్గాడ సుధీర్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు. సుధీర్‌కుమార్ హైదరాబాద్ రామకోటి శ్రీత్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో 20 ఏళ్ల పాటు అధ్యాపకులుగా పని చేసి హిందుస్థానీ వయోలిన్‌లో ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ప్రిన్సిపాల్‌గా ఏడేళ్లు, రామకోటి శ్రీత్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఆర్నెళ్లు పని చేశారు. 2021లో మళ్లీ పదోన్నతి పొంది హనుమకొండలోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నాలుగేళ్లుగా ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

### రాజన్నకు అవార్డు



**విద్యారణ్యపురి:** హనుమకొండ జిల్లా వేలేరు జెడ్పీహెచ్‌ఎస్ పీజీహెచ్‌ఎంగా పని చేస్తున్న గౌరిశెట్టి రాజన్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 37 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. వేలేరు హైస్కూల్‌లోనే తన ముగ్గురు పిల్లలను చదివించారు. తాను చదువుకున్న స్కూల్‌లోనే ఏడాదికాలంగా గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా పని చేస్తున్నారు. 9.7 జీపీఏ వచ్చిన ఇద్దరు విద్యార్థినులకు రూ.50 వేలు ఎస్‌ఆర్‌ఐ ద్వారా ఇప్పించారు. హనుమకొండ జిల్లా పరీక్షల బోర్డు సెక్రటరీగా సెక్రటరీగా మూడేళ్ల పాటు పని చేశారు.

**ఇందుమతికి..**



**హసన్‌పర్తి:** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా హసన్‌పర్తిలోని తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ ప్రిన్సిపాల్ పి.ఇందుమతి ఎంపికయ్యారు. 1996లో మొదటి పోస్టింగ్ విజయనగరం జిల్లా తాటిపోడి జూనియర్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా నియమితులయ్యారు. 2001లో హసన్‌పర్తికి బదిలీపై వచ్చారు. 2023లో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.

### సౌకర్యాలు మెరుగుపర్చాలి



**హన్మకొండ:** గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం బాలసముద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి అదనపు గదులు, మరుగు దొడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. జూలైవాడలోని బాలికల వసతి గృహంలో ప్రహరీ ఎత్తు పెంపు, ఆరెపల్లిలో డ్రెయినేజీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ, డీఈ, ఏఈలను ఆదేశించారు.

### కమిషనరేట్‌లో ఎస్సైల బదిలీ

**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి సీపీ అంబర్ కిషోర్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లిపెల్లి దివ్య మడికొండ నుంచి వంగర, జి.రాజిరెడ్డి నర్మెట నుంచి చెన్నారావుపేట, జి.అరుణ్ చెన్నారావుపేట నుంచి నర్మెట, ఎండీ ఫసియుద్దీన్ సీసీఎస్ నుంచి హనుమకొండ ట్రాఫిక్, ఎండీ యాకూబ్ వీఆర్ నుంచి సీసీఎస్‌కు బదిలీ చేశారు.



**విద్యార్థులకు నాణ్యమైన విద్య..** దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి.. తల్లిదండ్రులతో సమావేశాలు.... బోధనపరంగా కల్పిస్తున్న సదుపాయాలపై ఎప్పటికప్పుడు చర్చించడం .. సహచర ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లడం ద్వారా ఉత్తమ సేవలు అటు తల్లిదండ్రులతో, ఇటు విద్యార్థుల మనస్సులు గెలుచుకుంటున్నారు పలువురు ఉపాధ్యాయులు. నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యాబోధనలో వినూత్న పద్ధతులు, ఒకవైపు విద్యాబోధన మరోవైపు సేవా కార్యక్రమాలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనాలు..

# గురువులు.. పిల్లల నేస్తాలు

- విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన
- మరోవైపు సామాజిక సేవ.. బడికి చేయూత
- విద్యార్థుల సంఖ్యను పెంచి నిలబెట్టిన కొందరు..
- అందరి మనసు గెలిచిన గురువులు మరికొందరు..

**నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం**

## బడిని బతికించాడు!



**ఖిలా వరంగల్:** ఒక్కరు కూడా లేని పాఠశాలలో ప్రస్తుతం 230 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈఘనత ధర్మసాగర్ మండలం జానకీపురానికి చెందిన కుర్సపెల్లి భిక్షపతికి దక్కింది. 2010లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కరీమాబాద్‌లోని బొంబాయి రైస్ మిల్లు ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. ఇక్కడ బడి లేకపోవడంతో తొలుత చెట్టు నీడ పేద పిల్లలను చేరదీసి విద్యనందించారు. ఒకరిద్దరి నుంచి 13 మంది పిల్లలను తయారు చేశారు. బొంబాయి రైస్ మిల్ వద్ద చిన్న గదిని అద్దెకు తీసుకుని పాఠశాలను ప్రారంభించారు. భవన నిర్మాణం పూర్తై ఖాళీగా ఉన్న కాశికుంట ప్రభుత్వ పాఠశాలను స్థానికులతో కలిసి శుభ్రం చేశారు. చెట్లు కొడుతుండగా పాము కాటేసినప్పటికీ పాఠశాలను నీట్‌గా మార్చేశారు. అందులోనే పాఠాలు చెప్పడం ప్రారంభించారు. ఒకరిద్దరితో మొదలైన పాఠశాల నేడు 230 మంది విద్యార్థులకు చేరింది. ప్రస్తుతం 8 మంది ఉపాధ్యాయులు అందులో పనిచేస్తున్నారు.

## ప్రకృతి.. పాఠం

పత్తి చేనుపై పాఠం చెబుతున్న లింగమూర్తి



**నెల్లికుదురు:** మండలంలోని జామాతండా ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు లింగమూర్తి పెద్ద దిక్కుగా మారారు. 12ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తూ నలుగురు పిల్లలతో ఉన్న పాఠశాలలో 80మంది పిల్లలను చేర్పించి తల్లిదండ్రులకు నమ్మకం కల్పించారు. కాగా, ఇటీవల సీరోలు మండలం తాళ్ల సంకీసకు బదిలీ అయ్యారు. అయితే తండావాసులు లింగమూర్తిని రిలీవ్ కానివ్వకుండా ఇక్కడే పని చేయించుకుంటున్నారు. 80మంది పిల్లలకు ఆయన ఒక్కరే బోధిస్తున్నారు.

## ఏ స్కూల్‌కు వెళ్లినా రూపురేఖల మార్పు



**సాక్షిప్రతినిధి, వరంగల్ :** న్యూశాయంపేట పరిధి పోశంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఉప్పలయ్య ఏ స్కూల్‌కు వెళ్లినా దాని రూపురేఖలే మారుస్తారన్న పేరుంది. ఆయన గతంలో హనుమకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. హెచ్‌ఎంగా వచ్చినప్పుడు 170 మంది విద్యార్థులుండేవారు. సరైన సదుపాయాలు లేక చెట్లకిందే మధ్యాహ్న భోజనం వండేవారు. టాయిలెట్స్ అంతంత మాత్రమే. అలాంటి పాఠశాలలో దాతల సహకారంతో పాఠశాల రూపురేఖలే మార్చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌కింద వీ4 ఈక్విప్‌మెంట్ కంపెనీ సహకారంతో రూ.1.75 లక్షలతో డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటు చేయించారు. అబ్దుల్‌కలాం ఫౌండేషన్ సహకారంతో రూ.3.50 లక్షలతో అధునాతన లైబ్రరీ ఏర్పాటు చేయించారు. ఇలాంటి లైబ్రరీ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనూ లేదంటే అతిశయోక్తి కాదు.

## బహుమతులిచ్చి.. బడికి రప్పించి



**కాజీపేట రూరల్:** కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బి.సతీశ్ పాల్ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. స్కూల్ పరిసర ప్రాంత ఊళ్లల్లోని పిల్లలను తమ పాఠశాలలో చేర్పిస్తున్నారు. స్కూల్‌కు రాని పిల్లలకు బహుమతులిచ్చి పాఠశాలకు వచ్చేలా చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో తన భార్య జ్యోతికళ జ్ఞాపకార్థం వేదిక నిర్మించారు. హెడ్‌మాస్టర్ ఎస్.ఎం.ఎం. స్వామి పర్యవేక్షణలో ఉపాధ్యాయ బృందం సహకారంతో సతీశ్‌పాల్ కృషితో ఇంగ్లిష్‌మీడియం పాఠశాల విద్యార్థుల సంఖ్య గతేడాది హైస్కూల్‌లో 140 ఉండగా.. ఈ ఏడాది 170కి పెరిగింది. ప్రాథమిక పాఠశాలలో గతేడాది 110 మంది ఉండగా.. ఈ విద్యాసంవత్సరం 150 మందికి పెరిగారు. ఉర్దూ మీడియంలో గతేడాది 40 మంది ఉండగా.. ఇప్పుడు 50 మందికి పెరిగారు.

### విద్యాప్రదాతలు

- వివరాలు 8లో▸

## వృత్తి బోధన.. ప్రవృత్తి సేవ



**హన్మకొండ:** ఉపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని పాటిస్తూనే.. సామాజిక సేవ చేస్తూ.. పేద విద్యార్థులకు, దివ్యాంగులకు ఆసరాగా నిలుస్తున్నారు హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్. పుట్టుకతోనే కాలికి పోలియో సోకగా క్యాలిపర్స్ సాయంతో నడుస్తున్నారు. దివ్యాంగుల కోసం నిత్యావసర వస్తువుల వితరణ, ఫిజియోథెరపీ క్యాంపు ఏర్పాటు, అంధులకు బ్రెయిలీ లిపి పేపర్ల అందజేత వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 200 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ, 2 వేల మందికి స్టీల్ ప్లేట్లు, 350 మంది విద్యార్థులకు పరీక్షల కిట్ అందించారు. రవికుమార్ వద్ద భగవద్గీత శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు.

## కదిలించే కలాలను తయారు చేస్తూ..



**జనగామ:** బడిలో విద్యతో పాటు జీవిత పాఠాలను బోధిస్తున్నారు నర్మెట జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు పండిట్ త్రిపురారి పద్మ. సమాజ చైతన్యానికి తోడ్పడేలా పిల్లల్ని బాల రచయితలుగా తీర్చిదిద్దుతున్నారు. 'కవన మంజరి' పేరిట విద్యార్థులు రాసిన కథలు, కవితల్ని పుస్తకం రూపంలోకి తీసుకొస్తున్నారు. 'ఆకుపచ్చని ఆశల'తో పుస్తకంతో పాటు, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాతృమూర్తి జ్ఞాపకార్థం అచ్చువేసిన 'అమ్మా నీ కమ్మని పిలుపు మళ్లీ వినాలి' అనే పుస్తకంతో పాటు 'మొలక' ఆన్‌లైన్ పత్రికలో సైతం విద్యార్థుల రచనల్ని అచ్చు వేశారు. బాలకవి సమ్మేళనాలు నిర్వహిస్తూ.. స్వీయ రచనలను ప్రోత్సహిస్తున్నారు.

## భావవ్యక్తీకరణకు 'కోడ్' భాష



**కాళేశ్వరం:** రహస్య కోడింగ్ విధానాన్ని తయారు చేశారు మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మడ్క మధు. ఈ కోడింగ్ విధానం మన దేశానికి ఎంతో ఉపయోగపడుతుందని భావించి ఐ కోడింగ్, ఇయర్ కోడింగ్, ఐబ్రో కోడింగ్, ఫేస్ ఎక్స్‌ప్రెషన్ కోడింగ్ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఐఐఎస్‌ఎఫ్ (ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్) ఫరీదాబాద్‌లో జరిగిన సైన్స్ ఫెస్ట్‌లో భూపాలపల్లి జిల్లా తరఫున ఆరుగురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. దీంతో మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తదితరులు ప్రతిభ విద్యార్థులను అభినందించారు.

# గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య

**హన్మకొండ:** గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, సాగునీటిపారుదల, మైనింగ్, మత్స్య, ఆర్ అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు, గణేశ్ నవరాత్రి ఉత్సవ మండళ్ల కమిటీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఉత్సవాల ఏర్పాట్లు, నిమజ్జనానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. నిమజ్జనం ప్రాంతాల్లో ఒక్కో ప్రాంతంలో సీనియర్ జిల్లా అధికారితో పాటు మరో అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ లలితాదేవి, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓలు వెంకటేశ్, నారాయణ, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, తిరుమల్, డీఆర్‌ఓ వై.వి గణేశ్ పాల్గొన్నారు.



గణేశ్ ఉత్సవాల నిర్వహణ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

**మట్టి గణపతి విగ్రహాల పోస్టర్ల ఆవిష్కరణ**

చెరువుల స్వచ్ఛతకు భక్తులు నడుము బిగించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో మట్టి గణపతి విగ్రహాల పోస్టర్లను కలెక్టర్ పి.ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి ఆర్.సునీత, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

**యజమానులే సౌకర్యాలు కల్పించాలి..**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆయా భవనాల యాజమానులే అవసరమైన మరమ్మతులు చేయించాలని, సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చూడాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో అద్దె, సొంత భవనాల్లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల స్థితిగతులపై ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అద్దె భవనాల యజమానులతో సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

# ఫోర్జరీ సంతకాలతో దందా

- సూత్రధారి, నిందితుడు గోవింద్ సతీశ్ అరెస్ట్
- మట్టెవాడ పోలీసుల అదుపులో మరో ఏడుగురు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్

**సాక్షి, వరంగల్:** ఫ్యామిలీ సర్టిఫికెట్లు కావాలంటే క్షణాల్లో సిద్ధం అవుతాయి.. తహసీల్దార్‌ను సంప్రదించకుండానే ధ్రువీకరణపత్రాలు చేతికి అందుతాయి. రూ.వేలకు వేలు తీసుకుని ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు ఇస్తున్న శివనగర్‌కు చెందిన గోవింద్ సతీశ్‌ను మట్టెవాడ పోలీసులు అరెస్టు చేశారు. మధ్యవర్తి జూలూరి చక్రపాణితోపాటు వివిధ సర్టిఫికెట్లు పొందిన పస్తం సతీశ్, మహమ్మద్ అజారుద్దీన్, సయ్యద్‌సాబీర్, మాకుల దామోదర్, కాశెట్టి కమలాకర్, డీటీపీ ఆపరేటర్ కిరణ్ కుమార్‌ను కూడా అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ నకిలీ సర్టిఫికెట్లకు రూ.ఐదు వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేసినట్లు వెల్లడించారు.

**రెన్యువల్‌కు రావడంతో గుట్టురట్టు..**

వరంగల్‌లో వడ్డీ వ్యాపారం చేస్తున్న పస్తం సతీశ్ గతేడాది నకిలీ మనీ లెండింగ్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. ఈ ఏడాది ఆగస్టు 29న వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ వద్దకు వెళ్లి సదరు సర్టిఫికెట్ జతపర్చి రెన్యువల్‌కు దరఖాస్తు చేశాడు. ఆ సర్టిఫికెట్‌పై ఉన్న సంతకాలు తనవి కాదని తహసీల్దార్ మట్టెవాడ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పస్తం సతీశ్‌పై నిఘా ఉంచారు. దేశాయిపేటకు చెందిన జూలూరి చక్రపాణి ఇంటి వద్ద ఉన్నారని తెలుసుకొని వెళ్లి పట్టుకున్నారు. నిందితుడు సతీశ్‌ను విచారించగా జూలూరి చక్రపాణి ద్వారా కొత్తవాడకు చెందిన గోవింద్ సతీశ్‌ను కలిస్తే తహసీల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి, రౌండ్ సీల్ స్టాంపులు వేసి నకిలీ సర్టిఫికెట్ తయారుచేసిచ్చాడని తెలిపారు. మండిబజార్‌కు చెందిన ఖాజామహమ్మద్ అజారుద్దీన్, కాజీపేటకు చెందిన సయ్యద్ సబీర్, బ్యాంక్ కాలనీకి చెందిన దామోదర్ ఫ్యామిలీ సర్టిఫికెట్లు తీసుకున్నారని వెల్లడైంది. అలాగే, ఏనుమాములకు చెందిన కమలాకర్, సిరంగి రమేశ్‌కు గతంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాను తహసీల్దార్ ఇవ్వగా వారు పోగొట్టుకున్నారు. చక్రపాణి ద్వారా వారు గోవింద్ సతీశ్‌ను సంప్రదించారు. డ్రాఫ్ట్ సిద్ధం చేసి తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి, నకిలీ రబ్బర్‌స్టాంపులు వేసి నకిలీ పట్టా ఇచ్చారు. ఫోర్జరీ డాక్యుమెంట్లను తయారు చేయడానికి 14 ఏళ్ల క్రితం రబ్బర్ స్టాంపులు తయారుచేసి ఇచ్చిన హనుమకొండ టైలర్స్‌స్ట్రీట్‌కు చెందిన సముద్రాల కిరణ్‌కుమార్‌ను కూడా అరెస్ట్ చేశారు. మధ్యవర్తిగా మరో వ్యక్తి మాన్యం సిద్ధయ్య ఉన్నట్లు విచారణలో తేలిందని, అతడిపై కూడా లోతుగా విచారణ చేస్తున్నామని చెప్పారు. కాజీపేట తహసీల్దార్ పేరు మీద ఉన్న రబ్బర్‌స్టాంపు, హనుమకొండ జిల్లా రబ్బర్ స్టాంపు, వరంగల్ తహసీల్దార్ పేరుతో రబ్బర్‌స్టాంపు, తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన రౌండ్ సీల్‌ను స్వాధీనం చేసుకున్నామని నందిరాంనాయక్ తెలిపారు. సమావేశంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపీ పాల్గొన్నారు.

**లోతుగా విచారిస్తే మరెన్నో...**

ఫోర్జరీ దందా వరంగల్, కాజీపేట తహసీల్దార్ కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాలేదని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదుల సంఖ్యకుపైగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధమున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ శివారు ప్రాంతాల్లోని తహసీల్దార్ కార్యాలయాలతోపాటు ఆర్డీఓ కార్యాలయ సంతకాలు ఫోర్జరీ చేసినట్టు అనుమానం రావడంతో ఆ దిశగా మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి నేతృత్వంలోని బృందం విచారణ వేగిరం చేసింది. త్వరలో మరిన్ని అరెస్టులు ఉండే అవకాశమున్నట్లు సమాచారం.

## జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి



పరకాల ఆరోగ్య ఉప కేంద్రంలో రోగిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి

**పరకాల:** సమయపాలన పాటించడంతో పాటు జ్వరాలతో బాధపడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ వారికి తగిన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి సూచించారు. పరకాల ఆరోగ్య ఉప కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వర సర్వేను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బందికి సూచించారు. తమ పరిధి రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లను తరచూ సందర్శించి ఎవరైనా.. జ్వరాల బారిన పడితే తక్షణమే వైద్యం అందించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

## 26న డాక్ అదాలత్

**ఖిలా వరంగల్:** పోస్టల్ సర్వీసులకు సంబంధించిన వినియోగదారుల ఫిర్యాదులపై ఈనెల 26న ప్రాంతీయస్థాయి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వరంగల్ తపాలా శాఖ డివిజన్ రవికుమార్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈనెల 11 వరకు 47వ డాక్ అదాలత్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్) కె.శ్రీకాంత్, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్–500001 చిరునామాకు చేరేవిధంగా ఫిర్యాదులు పంపించాలని కోరారు.

## మత్తడి మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి



మత్తడి మరమ్మతు పనుల్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గుండె బాబు

**కమలాపూర్:** 'ఉండేనా.. ఊడేనా' శీర్షికన జూలై 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతేడాది కురిసిన భారీ వర్షానికి పెద్ద చెరువు మత్తడి దెబ్బతిని గండి పడింది. ఏడాది దాటినా.. పెద్ద చెరువు మత్తడి మరమ్మతు పనులు చేపట్టకపోగా ఈఏడాది ఎండాకాలంలో చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఈసారి భారీ వర్షాలు కురిసి చెరువు నిండితే మత్తడితో పాటు పెద్ద చెరువుకు ప్రమాదం ఉందని సాక్షిలో కథనం ప్రచురితమవడంపై నీటి పారుదల శాఖ అధికారులు స్పందించారు. మత్తడి వద్ద తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. దెబ్బతిని కొట్టుకుపోయిన మత్తడి వద్ద ఇసుక బస్తాలు వేయించారు. మత్తడి మరమ్మతు పనుల్ని నీటి పారుదల శాఖ ఏఈ అనిల్‌రెడ్డితో కలిసి స్థానిక ఎంపీడీఓ గుండె బాబు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మత్తడి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయకపోతే చెరువులోని నీరంతా మత్తడి ద్వారా దిగువకు పోయి ఆయకట్టు కింద రైతులు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. పెద్ద చెరువులోకి వరద నీరు పెద్ద ఎత్తున వస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చెరువులో చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రమేశ్, మత్స్యకారులు, రైతులు ఉన్నారు.

# విద్యాప్రదాతలు..

కొందరు అధ్యాపకులు తమ సబ్జెక్ట్‌తోపాటు మానవతా విలువలు, మానవ సంబంధాలు, తదితర అంశాలపై విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేపడుతూ ఆదర్శ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. అలాగే, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలు సొంత ఖర్చులతో సమకూర్చుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈరకమైన విద్యాబోధన చేపడుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అధ్యాపకులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈనెల 5న (నేడు) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.





వాసం శ్రీనివాస్ ఎ. శ్రీనాథ్ కొలిపాక శ్రీనివాస్

విద్యారణ్యపురి : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకు అవార్డులకు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసం శ్రీనివాస్, ఇంగ్లిష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అడ్డగట్ల శ్రీనాథ్ ఎంపికయ్యారు. అలాగే, ప్రభుత్వ పింగిళి కళాశాల నుంచి హిస్టరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ ఎంపికయ్యారు.

**ఉచిత కోచింగ్ ఇస్తున్న వాసం శ్రీనివాస్**

కేడీసీలో కెమిస్ట్రీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ వాసం శ్రీనివాస్ 22 సంవత్సరాలుగా విద్యాబోధనానుభవంతోపాటు జాతీయ అంతర్జాతీయ పరిశోధనల జర్నల్స్‌లో 31 పరిశోధనపత్రాలు సమర్పించారు. కేడీసీలో 2014నుంచి 2018వరకు ప్రతి సంవత్సరం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్ష కోసం 40 రోజుల ఉచిత కోచింగ్ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

**అంకితభావంతో పనిచేస్తున్న శ్రీనాథ్**

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డాక్టర్ ఎ. శ్రీనాథ్ ఇంగ్లిష్ అధ్యాపకుడిగా అంకితభావంతో పనిచేస్తూ వస్తున్నారు. ఐసీటీ మెథడ్స్ ఆఫ్ టీచింగ్ ద్వారా సులభ పద్ధతిలో ఇంగ్లిష్ సబ్జెక్టులో విద్యాబోధన చేస్తున్నారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని ఓ కళాశాలకు కొద్దికాలం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. 2018 నుంచి 2024 వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేటలో విధులు నిర్వర్తించారు. ఇటీవలే నర్సంపేట నుంచి కేడీసీకి బదిలీపై వచ్చారు.

**30కిపైగా పరిశోధన పత్రాలతో కొలిపాక శ్రీనివాస్**

హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో హిస్టరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ 30కిపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. చరిత్ర సబ్జెక్టుకు సంబంధించి నాలుగు పుస్తకాలు రచించారు. 20జాతీయ సదస్సులో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు.

### రాష్ట్రస్థాయి అవార్డుకు సోమయ్య


మట్టపల్లి సోమయ్య

నర్సంపేట: నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న వాణిజ్యశాస్త్ర సహాయ ఆచార్యుడు డాక్టర్ మట్టపల్లి సోమయ్య జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. బొడ్డుగొండ గ్రామంలో మట్టపల్లి సంపతయ్య–లక్ష్మి దంపతులకు జన్మించిన ఆయన పట్టుదలతో చదువుకున్నారు. కళాశాలలో దోస్త్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ అడ్మిషన్ల పెంపుదలకు కృషి చేశారు. కళాశాల విద్యాకమిషనరేట్ ప్రవేశపెట్టిన యువతరంగం పోటీలకు రాష్ట్రస్థాయి సమన్వయకర్తగా పనిచేశారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకునేందుకు కృషిచేశారు. జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులకు కళాశాల కామర్స్ విద్యార్థులకు రీసెర్చ్ గైడ్‌గా రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

### శ్రీనివాస్ కార్యక్రమాలు ఆదర్శం..


అస్నాల శ్రీనివాస్

ధర్మసాగర్ : ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయి. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల నమోదు అనూహ్యంగా క్షీణిస్తున్న నేపథ్యంలో అధ్యాపక సంఘ నేతగా శ్రీనివాస్ పలు కార్యక్రమాలు చేపట్టారు. కొడకండ్ల కళాశాలకు స్థల సేకరణ చేపట్టి నూతన భవన నిర్మాణానికి కృషి చేశారు. అలాగే, విద్యా సంవత్సరంలో జనవరి నుంచే వందలాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ ఇంటర్ విద్యకు ఉండే ప్రత్యేక అవకాశాల గురించి కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటి వరకు కొడకండ్ల, రంగశాయిపేట, తాడ్వాయి ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ధర్మసాగర్‌లో పని చేస్తున్నారు. కాగా, మంత్రి సీతక్క జీవిత చరిత్రను 'రణధీర' పేరుతో గ్రంథస్తం చేసి సీఎం రేవంత్‌తో ఆవిష్కరింపజేశారు.

### 30 సంవత్సరాలకు పైగా విద్యాబోధన.. 62 పరిశోధన పత్రాలు


ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆచార్యుడు బి. వెంకట్రామ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. పరకాల సమీపంలోని పెద్దకోడెపాక చెందిన ఆచార్య బి. వెంకట్రామ్‌రెడ్డి కేయూలోని ఫిజిక్స్ విభాగంలో 2003లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆ తరువాత అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. దాదాపు 30 సంవత్సరాలకుపైగా విద్యాబోధన, పరిశోధనానుభవం కలిగిన వెంకట్రామ్‌రెడ్డి ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 62 పరిశోధన పత్రాలు సమర్పించారు. ఇండియన్ స్పెక్ట్రో అసోసియేషన్ లైఫ్‌అచీవ్‌మెంట్ అవార్డు, ఐఎస్‌పీఏ డాక్టర్ గుణశేఖరన్ అవార్డు కూడా అందుకున్నారు. ఫిజిక్స్ విభాగం అధిపతిగా, బోర్డు స్టడీస్ చైర్మన్‌గా, గోదావరిఖనిలో పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం కేయూలో అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, పరీక్షల నియంత్రణాధికారిగా, హాస్టళ్లడైరెక్టర్‌గా, రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం శాతవాహన యూనివర్సిటీకి సైన్స్‌డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### నాడు జిల్లా..నేడు రాష్ట్ర స్థాయి అవార్డు


శ్రీనివాస్‌రెడ్డి

పరకాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకుడు శ్రీనివాస్‌రెడ్డికి ఏడాదిలోనే మరో గౌరవం దక్కింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. 'అనేక యూనివర్సిటీలలో నా ద్వారా ఎంఎస్సీ జువాలజీలో చాలా మంది విద్యార్థులు చేరారు. నా నాలుగు జువాలజీ పుస్తకాల ప్రచురణ,15 ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో పరిశోధన పత్రాల ప్రచురణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా మారాయి'అని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# పలు రైళ్లు రద్దు..



కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. లింగంపల్లి–కాకినాడ పోర్టు (12738) ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్టు–లింగంపల్లి (12737) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టం–నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. అదేవిధంగా ఈ నెల 5వ తేదీన నాందేడ్–విశాఖపట్నం (20812) ఎక్స్‌ప్రెస్, విజయవాడ–సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విజయవాడ (12714) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

**పార్శల్ రద్దు**

తిరుపతి–కరీంనగర్ (12761) ఎక్స్‌ప్రెస్ బుధవారం విజయవాడ–కరీంనగర్ మధ్య రద్దు చేశారు.

**కాజీపేట మీదుగా మళ్లింపు**

న్యూఢిల్లీ–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12622) ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం వయా రేణిగుంట, గుంతకల్, సికింద్రాబాద్, కాజీపేట మీదుగా దారి మళ్లించారు.

**యథావిధిగా రైళ్ల కొనసాగింపు**

తాళ్లపూసపల్లి–మహబూబాబాద్ సెక్షన్‌లో డబుల్ లైన్ ట్రాక్, ఇంటికన్నె–కేసముద్రం సింగిల్‌లైన్ ట్రాక్‌ను పునరుద్ధరించి బుధవారం రాత్రి నుంచి యథావిధిగా రైళ్లను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## వరద హోరు..
# జలపాతాల జోరు

● ఆకర్షిస్తున్న పెద్ద చెరువు, పాండవుల జలపాతం


బయ్యారం పెద్దచెరువు మూడో అలుగు ప్రాంతంలో జాలువారుతున్న నీరు


బయ్యారం పెద్దగుట్టపై నుంచి జాలువారుతున్న నీరు

బయ్యారం: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో బయ్యారం పెద్దచెరువులోకి భారీ స్థాయిలో నీరు చేరుతుండడంతో మూడు అలుగుల ద్వారా నీరు బయటకు వెళ్తోంది. మూడో అలుగు నుంచి వస్తున్న నీరు బొగత జలపాతంలా ఎత్తైన ప్రాంతం నుంచి జాలువారుతూ చూపరులను ఆకట్టుకుంటుంది. ఇదే మాదిరి బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం నుంచి నీరు జాలువారుతోంది. దీంతో ఈ అందాలు చూసేందుకు పర్యాటకులు ఆయా ప్రాంతాలకు తరలివస్తున్నారు.

# కుటుంబ కలహాలతో అడ్తి వ్యాపారి ఆత్మహత్య

● కాశిబుగ్గ సొసైటీ కాలనీలో ఘటన


రాజేందర్(ఫైల్)

కాశిబుగ్గ : కుటుంబ కలహాలతో ఓ అడ్తి వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం కాశిబుగ్గ సొసైటీ కాలనీలో చోటుచేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. నగరంలోని కరీమాబాద్‌కు చెందిన ఎక్తే రాజేందర్(50) కాశిబుగ్గ సొసైటీ కాలనీలో తండ్రి రాజలింగం, చెల్లి శోభారాణితో కలిసి అద్దెకు ఉంటూ వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అడ్తి వ్యాపారం(లక్ష్మి ట్రేడర్స్) చేస్తున్నాడు. రాజేందర్‌కు భార్య కల్పన, ఇద్దరు కుమారులు సంతోశ్, సాయితేజ ఉన్నారు. ఈ క్రమంలో సంవత్సరం నుంచి కుటుంబ కలహాలతో భార్య, పిల్లలు వేరుగా ఉంటున్నారు. దీంతో రాజేందర్ పిలిచినా భార్యా పిల్లలు రావడం లేదు. దీంతో రాజేందర్ మంగళవారం రాత్రి తన తండ్రితో మాట్లాడి తీవ్ర మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి చెల్లి శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు.

## క్లుప్తంగా

### 26న డాక్ అదాలత్

హన్మకొండ: పోస్టల్ సర్వీస్ సమస్యలపై ఈ నెల 26న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ హనుమంతు తెలిపారు. ఈ డాక్ అదాలత్ 26న ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో లింక్ కోసం ఫిర్యాదుదారులు మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీని తమ ఫిర్యాదులో కచ్చితంగా తెలపాలని సూచించారు. ఈ నెల 11లోపు ఫిర్యాదులు పంపాలని తెలిపారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా ప్రజలు తమ పోస్టల్ సర్వీసెస్ ఫిర్యాదులను పోస్టల్ ఎన్వలప్, లేదా కవర్‌లో పంపాలని, ఎన్వలప్, కవర్‌పై 47వ డాక్ అదాలత్ అని రాయాలని సూచించారు. కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), ది పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్–500001 చిరునామాకు పంపాలని కోరారు.

### 'కుసుమ్ యోజన'ను వినియోగించుకోవాలి


రైతులు, మహిళలకు సౌరఫలకలపై అవగాహన కల్పిస్తున్న మహేందర్‌రెడ్డి

మామునూరు: ప్రధానమంత్రి కుసుమ్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా పునరుత్పాదకత ఇంధన డైరెక్టర్, శాస్త్రవేత్త మహేందర్‌రెడ్డి సూచించారు. ఈమేరకు బుధవారం మామునూరు పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అధ్యక్షతన కుసుమ్ యోజన పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుసుమ్ యోజన పథకం ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందాలని సూచించారు. అనంతరం రైతులు, మహిళలకు ఇంధన వినియోగానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. ఇంటిలో సౌరఫలకాలను ఏ విధంగా అమర్చుకోవచ్చనే అంశంపై వివరించారు. సమావేశంలో అరుణ్‌జ్యోతి, సీహెచ్‌సౌమ్య, రాజు, శశాంక్, గణేశ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పరవళ్లు..


కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్‌ను తాకుతూ వెళ్తున్న గోదావరి

● కాళేశ్వరం వద్ద 11.300 మీటర్ల ఎత్తులో ప్రవాహం
● అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల గుండా దిగువకు వరదనీరు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి వరద తగ్గేదెలే అన్నట్లు పరవళ్లు తొక్కుతోంది. బుధవారం కూడా వరద జోరు కొనసాగింది. ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి బరాజ్‌ల గేట్లు ఎత్తడంతో దిగువన గోదావరికి వరద నీరు భారీగా తరలివస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతి) బరాజ్‌కు భారీగా వరద తాకిడి తగ్గడం లేదు. బరాజ్‌కు పెద్దవాగుతో పాటు చిన్నవాగుల వరద పోటెత్తడంతో 4.43 లక్షల క్యూసెక్కులు తరలివస్తోంది. బరాజ్‌లోని మొత్తం 66గేట్లు ఎత్తిఉంచడంతో దిగువన కాళేశ్వరం చేరుతుంది. మహారాష్ట్ర గుండా వస్తున్న ప్రాణహితకు వరద ప్రవాహం కూడా తోడవడంతో రెండు ఉభయ నదులు కలిసి కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 11.300మీటర్ల ఎత్తులో ప్రవాహం దిగువకు తరలివెళ్తోంది. దీంతో మేడిగడ్డ(లక్ష్మి)బరాజ్ వద్ద 8.3 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బరాజ్‌లోని మొత్తం 85గేట్లు ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లు తరలిస్తున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజుల పాటు వరద జోరు అదేస్థాయిలో దిగువకు తరలుతోంది. బరాజ్‌ల్లో కూడా నీరు అదే స్థాయిలో తరలుతోంది. కాళేశ్వరం వద్ద నీటిమట్టం 11 మీటర్ల ఎత్తు నుంచి 12.010 మీటర్ల ఎత్తు దాటకుండా కాస్త తగ్గుతూ..కాస్త పెరుగుతూ దోబూచులాడుందని స్థానికులు పేర్కొంటున్నారు.

# ప్రతీ గంటకు విద్యుత్ పరిస్థితి సమీక్షించాలి

● ఎస్ఈలంతా హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలి
● విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు
● టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


కర్నాటి వరుణ్ రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాల నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్‌లు హెడ్‌క్వార్టర్‌లోనే ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 9 వరకు భారీ వర్షాలుండే అవకాశముందని, ఈ క్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్లు ప్రతీరోజు ప్రతీ గంటకు విద్యుత్ పరిస్థితి సమీక్షించాలని సూచిసూ బుధవారం ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో కంట్రోల్ రూం 24/7 పనిచేసేల చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడిన వెంటనే పరిష్కరించాలన్నారు. అవసరమైన సామగ్రి, ప్రధానంగా స్తంభాలు అందుబాటులో ఉంచుకోవాలని, కాంట్రాక్టర్‌లు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు, ఉద్యోగులకు సెలవులు అన్ని రద్దు చేసినట్లు తెలిపారు. అత్యవసరంగా సెలవు కావాలంటే, సీఈ (హెచ్ ఆర్డీ – ట్రైనింగ్)కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదేని అవసరమైతే వెంటనే ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం (కార్పొరేట్ ఆఫీస్)కు సమాచారం అందించాలని సూచించారు.

# దీప్తి.. ఓరుగల్లు కీర్తి

● పారాలింపిక్స్‌లో మన క్రీడాకారిణి దీప్తి జీవాంజికి కాంస్య పతకం
● స్వగ్రామం కల్లెడలో సంబరాలు.. అభినందనల వెల్లువ


కల్లెడలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు


దీప్తి జీవాంజి

పర్వతగిరి: దీప్తి.. ఓరుగల్లు కీర్తి. పారిస్ పారాలింపిక్స్‌లో మన క్రీడాకారిణి కాంస్య పతకం సాధించి దేశంతోపాటు వరంగల్ జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి తీసుకొచ్చింది. దీంతో దీప్తి జీవాంజి స్వగ్రామం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా దీప్తికి అభినందనలు వెల్లువెత్తాయి. కాగా, గతంలో ఆర్చరీ క్రీడల్లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన వర్ధినేని ప్రణిత ఒలింపిక్‌లో పాల్గొన్నా అర్హత సాధించలేకపోయింది. ఈ క్రమంలో పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో అథ్లెటిక్‌లో దీప్తి జీవాంజి కాంస్య పతకం సాధించారు. అలాగే, పారాలింపిక్స్ చరిత్రలో పతకం సాధించిన తొలి తెలుగు క్రీడాకారిణిగా రికార్డులకెక్కారు. మంగళవారం రాత్రి జరిగిన 400 మీటర్ల టీ–20 విభాగం ఫైనల్లో దీప్తి 55.82సెకన్లలో లక్ష్యం చేరుకుని మూడో స్థానంలో నిలిచారు. దీంతో ఆమెకు కాంస్య పతకం లభించింది. గత మే నెలలో జపాన్‌లో కోబ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక పారా అథ్లెటిక్స్ మహిళల 400మీటర్ల టీ–20కేటరిగీలో దీప్తి జీవాంజి 55.06 సెకన్లలో పరుగు పూర్తి చేసి స్వర్ణ పతకం కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీప్తి ప్రస్తుతం కాంస్య పతకం సాధించడంతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పర్వతగిరి, కల్లెడ గ్రామాల్లో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

**దీప్తికి ప్రశంసల వెల్లువ..**

పారిస్ పారాలింపిక్స్ మహిళల విభాగంలో 400 మీటర్ల టీ–20 రేసులో కాంస్య పతకం సాధించిన వరంగల్ ముద్దుబిడ్డ దీప్తి జీవాంజికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ ఎక్స్ ద్వారా అభినందనలు తెలిపారు. ఆమె ప్రతిభ ప్రతీ మహిళకు ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీప్తికి కోట్లాదిమంది ప్రజల తరఫున అభినందనలు తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఫోన్‌లో దీప్తికి అభినందనలు తెలిపారు. పర్వతగిరి కాంగ్రెస్ పార్టీ తరఫున దీప్తి తల్లిదండ్రులను సన్మానించారు.

# సైబర్ నేరగాళ్ల ఖాతాలకు డబ్బు మళ్లింపు..

● సైబర్ నేరస్తుడి అరెస్ట్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ విజయ్‌కుమార్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్

వరంగల్ క్రైం : దేశ వ్యాప్తంగా పెట్టుబడుల ముసుగులో ప్రజలను నమ్మించి రూ.కోట్లలో కొల్లగొట్టిన ప్రజాధనాన్ని సైబర్ నేరగాళ్ల వ్యక్తిగత ఖాతాలకు మళ్లిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన సైబర్ నేరస్తుడిని వరంగల్ కమిషనరేట్ విభాగానికి చెందిన సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసినట్లు వరంగల్ సైబర్ క్రైమ్స్ ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రజలను నమ్మించి పెట్టుబడి పెట్టిన డబ్బుకు రెట్టింపు వస్తుందని మోసం చేసి కోట్లలో డబ్బు కొల్లకొడుతున్న సైబర్ నేరగాళ్లు పోలీసులకు చిక్కకుండా దోచుకున్న డబ్బును భద్రం చేసుకునేందుకు తమిళనాడులోని చెన్నైకి చెందిన నిందితుడు మరియా బెనెడిక్ట్ ఖాతాలోకి మళ్లించే వారు. ఇలా సైబర్ నేరగాళ్లు మళ్లించిన డబ్బును నిందితుడు బెనెడిక్ట్ బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి క్రిప్టో కరెన్సీ, డాలర్స్‌గా మార్చి తిరిగి సైబర్ నేరగాళ్లకు సంబంధించిన వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసేవాడు. కాగా, గత నెల హనుమకొండలో పెట్టుబడి పేరుతో సైబర్ నేరగాళ్ల చేతుల్లో రూ.33.50 లక్షలు నష్టపోయిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో బాధితుడి డబ్బును సైబర్ నేరగాళ్లు నిందితుడు బెనెడిక్ట్ బ్యాంకు ఖాతాకు మళ్లించినట్లు గుర్తించారు. మంగళవారం నిందితుడిని చెన్నైలో అరెస్ట్ చేసి వరంగల్ కమిషనరేట్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు చరణ్, శివకుమార్, ఏఎస్ఐ సల్మాన్ పాషా, రాజేశ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, రాజును సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

# వర్షానికి నానిన గోడ కూలి వృద్ధురాలి మృతి


భూపాల్‌నగర్‌లో కూలిన ఇంటి గోడ

ములుగు రూరల్: వర్షానికి నానిన గోడ కూలి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని భూపాల్‌నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామానికి చెందిన సున్నం ఆగమ్మ(75) ఇంటి గోడ నానింది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న వృద్ధురాలిపై పడడంతో మృతి చెందింది. కాగా, ఇంటి దర్వాజపై నిర్మాణం సరిగలేకపోవడంతో గోడకూలి ఆగమ్మ మృతి చెందిందని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారికి నోటీసులు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.